సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



ఆ రైళ్లు..పట్టాలెక్కేనా?

జిల్లా నుంచి బొగ్గు, ప్రజా రవాణా ద్వారా రైల్వే శాఖకు భారీగా ఆదాయం వస్తున్నా అవసరమైన రైళ్లు నడిపించడం లేదు. 8లో



పీడీఎస్‌యూది పోరాటాల చరిత్ర

విద్యారంగ సమస్యలపై 50 ఏళ్లుగా పోరాడుతున్న పీడీఎస్‌యూ చరిత్ర అజరామరమని ప్రొఫెసర్ ఖాసీం, పోటు రంగారావు అన్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం వాతావరణం చల్లగా ఉన్నా మధ్యాహ్నానికి ఎండ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



స్వామివారి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం గావించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారి కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



పెద్దమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి ఆదివారం విశేష పూజలు చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీ పద్మావతి శ్రీనివాస కల్యాణం హరికథ..

అమ్మవారి ఆలయం వద్ద తెలుగు భాషా సాంస్కృతిక, దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి శ్రీనివాస కల్యాణం హరికథ ఏర్పాటు చేశారు.

నేటి ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఐడీఓసీలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అధికారులు అందుబాటులో ఉండనందున ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

నిండుకుండలా కిన్నెరసాని

406.60 అడుగులకు చేరిన నీటిమట్టం



కిన్నెరసానిలోకి భారీగా చేరిన నీరు

పాల్వంచరూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో రిజర్వాయర్ నిండు కుండను తలపిస్తోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల కిన్నెరసాని జలాశయానికి రెండు రోజులుగా ఎగువ నుంచి 200 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. కాగా, శనివారం నాటికి నీటిమట్టం 406.60 అడుగులకు పెరిగిందని డ్యామ్‌సైడ్ ఇంజనీర్ తెలిపారు. వరద ఉధృతి పెరిగితే ప్రాజెక్టు గేట్లు ఎత్తివేస్తామని చెప్పారు.

మూడు నై.. ఒకటికే సై



భద్రాచలం వ్యూ

ఎన్నో ఏళ్లకు పంచాయతీ 'ఢంకా'

- భద్రాచలం ఒక జీపీగానే ఓటరు జాబితాకు ఆదేశం
- అంతర్గత పనుల్లో అధికారులు బిజీ బిజీ
- ప్రభుత్వ బహిరంగ ప్రకటనతోనే వీడనున్న సందిగ్ధత

భద్రాచలం: భద్రాచలంలో ఎన్నో ఏళ్ల తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికల బాజా మోగనుంది. మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న భద్రాచలాన్ని మున్సిపాలిటీగా మారుస్తారని, విడదీసి మూడు పంచాయతీలు చేస్తారని ప్రచారం హోరెత్తినా.. చివరకు ఒక పంచాయతీకే ఎన్నికలు జరగనున్నాయి. దీంతో పదవులపై ఆశలు పెట్టుకున్న రాజకీయ నిరుద్యోగుల కల తీరనుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ, రెవెన్యూ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఓటరు జాబితాను సిద్ధం చేస్తుండగా, ప్రభుత్వం బహిరంగ ప్రకటన చేసి సందిగ్ధతకు ముగింపు పలకాల్సి ఉంది.

ఉన్నతాధికారుల ఆదేశాలతో..

భద్రాచలాన్ని మూడు, సారపాకను రెండు పంచాయతీలుగా విభజిస్తున్నట్టు గత ప్రభుత్వం ప్రకటించిందే తప్ప సాంకేతికంగా అమోదం పొందలేదు. పంచాయతీలను విభజనపై కలెక్టర్ ప్రభుత్వం తరుపున డిక్లరేషన్ ఇవ్వాలి. కానీ ఇవేమీ జరగలేదు. ఇక భద్రాచలం, సారపాకను ఒకే పంచాయతీగా పరిగణిస్తూ ఓటరు జాబితా సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారులకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో స్థానిక అధికారులు జాబితా తయారీలో నిమగ్నమయ్యారు. అయితే ఈ విషయాన్ని ప్రభుత్వం కానీ, అధికారులు కానీ బహిరంగంగా ప్రకటించలేదు.

అసెంబ్లీ రెండుసార్లు ఆమోదించినా..

భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని శాంతినగర్, సీతారామనగర్, భద్రాచలంగా, సారపాకను ఐటీసీ, సారపాకగా ముక్కలు చేస్తూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై స్థానికంగా వ్యతిరేకత, ఆగ్రహావేశాలు వ్యక్తమైనా నాటి ప్రభుత్వం తగ్గకుండా.. అసెంబ్లీలో పంచాయతీరాజ్ చట్ట సవరణ చేసి గవర్నర్‌కు పంపింది. ఈ బిల్లును నాటి గవర్నర్ తమిళి సై తిప్పి పంపగా, ప్రభుత్వం మళ్లీ రెండో సారి కూడా బిల్లు ఆమోదించి పంపింది. ఆ తర్వాత రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓడిపోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఈ సమస్య అక్కడే ఆగిపోయింది. అయితే తాజాగా రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరపాలని ప్రభుత్వం భావించటంతో భద్రాచలం, సారపాకలపై తప్పనిసరి నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రాజకీయ పార్టీల కోలాహలం..

భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీకు చివరిసారిగా 2013లో ఎన్నికలు జరిగాయి. ఆ పాలకవర్గ కాలం 2018లో ముగిసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పాలకవర్గం లేకుండా అధికారులతోనే పాలన సాగుతోంది. అయితే నాటి నుంచి ఈ ఎన్నికలపై రాజకీయ పార్టీల నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సుమారు లక్ష జనాభా ఉన్న పంచాయతీ కావడంతో సర్పంచ్‌తో పాటు వార్డు మెంబర్లుగా గెలుపొందాలని పలువురు నాయకులు, ఔత్సాహికులు, యువకులు తహతహలాడుతున్నారు. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల్లో చిన్నా, పెద్దా లీడర్లతో పాటు కార్యకర్తల్లోనూ జోష్ నెలకొననుంది.

పాత పంచాయతీల ప్రకారమే ఎన్నికలు

భద్రాచలం, సారపాక గ్రామపంచాయతీలలో పూర్వ లెక్కల ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి. పంచాయతీల విభజనకు ప్రభుత్వ విధానంగా పూర్తి స్థాయిలో ఆమోదం లభించకపోవడంతో టెక్నికల్‌గా ఆచరణలోకి రాలేదు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్వ పంచాయతీల ప్రకారమే ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నాం. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన అనంతరం ప్రకటిస్తాం. – చంద్రమౌళి, జిల్లా పంచాయతీ అధికారి

ఈ సారైనా కనికరించండి



పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్

- గతంలో ఏటా దసరాకు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఉద్యోగులకు బోనస్
- గత ఆరేళ్లుగా నిలిపేసిన యాజమాన్యాలు
- తాజాగా సింగరేణిలో బోనస్ ప్రకటన
- తమకూ పునరుద్ధరించాలంటున్న కేటీపీఎస్, బీటీపీఎస్ ఉద్యోగులు

పాల్వంచ: తాము పనిచేస్తున్న సంస్థనే దేవాలయంగా భావించి అహర్నిశలూ శ్రమించి లాభాల బాట పట్టిస్తున్న ఉద్యోగులకు ఏటా రావాల్సిన ఇన్సెంటివ్‌లను యాజమాన్యం విడుదల చేయడం లేదు. ఈ అంశంపై ప్రతీసారి యాజమాన్యం దృష్టికి తీసుకెళుతున్నా పట్టించుకోవడం లేదని ఉద్యోగ, కార్మిక సంఘాలు అంటున్నాయి. ప్రతీ దసరాకు సంస్థ లాభాల్లో వాటా తమకు అందాలనే ప్రక్రియ గత ఆరేళ్లుగా నిలిచిపోయిందని ఉద్యోగులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాదైనా తమకు లాభాల వాటా ఇస్తారా అని కేటీపీఎస్, బీటీపీఎస్‌ల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వేచి చూస్తున్నారు.

5 నుంచి 10 శాతం ఇవ్వాలి..

సింగరేణి సంస్థ లాభాల్లో ఉన్నట్టే విద్యుత్ సంస్థల్లో జెన్‌కోలో కూడా లాభాలు వస్తున్నాయి. ఒక యూనిట్ విద్యుత్ ఉత్పత్తి తయారీకి రూ.3 నుంచి రూ.4.50 వరకు ఖర్చవుతుండగా మార్కెట్‌లో రూ.6 నుంచి ఒక్కోసారి రూ.24 వరకు అమ్ముతున్నారు. తక్కువ ధరకు ఉత్పత్తి చేసి, అధిక ధరకు అమ్మడం ద్వారా సంస్థ భారీగానే లాభాలు గడిస్తోంది. అందులో 5 నుంచి 10 శాతం ఉద్యోగులకు ఇన్సెంటివ్(బోనస్) రూపంలో గతంలో ప్రతీ దసరాకు ఇచ్చేవారని, గత ఆరేళ్లుగా దీన్ని నిలిపివేశారని కార్మిక సంఘాల నేతలు అంటున్నారు. బీఆర్‌ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ఈ సంప్రదాయాన్ని నిలిపివేసిందని, ఇప్పుడు రాష్ట్రంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కార్ అయినా బోనస్ ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. జెన్‌కో సంస్థలో పనిచేసే ఉద్యోగులకు అత్యధిక వేతనాలు ఉంటాయని భావించిన గత ప్రభుత్వం తమకు బోనస్ నిలిపేసిందని ఆరోపించారు. తాము ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నామనే విషయాన్ని కొత్త సర్కార్ అయినా గుర్తించాలని వేడుకుంటున్నారు. దసరా వస్తోందంటే తమకు బోనస్ ఇస్తారని ఇన్నాళ్లు ఆశగా ఎదురు చూశామని, అయితే ప్రతీ ఏడాది తమకు నిరాశే ఎదురైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి సంస్థను ఆదర్శంగా తీసుకుని తమకు కూడా బోనస్ ఇవ్వాలని కోరుతున్నారు.

రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తాం



గతంలో ప్రతీ దసరాకు జెన్‌కో యాజమాన్యం ఇన్సెంటివ్ ఇచ్చేది. దీంతో కుటుంబం అంతా ఎంతో సంతోషంగా పండుగను ఘనంగా జరుపుకునేవాళ్లం. సంస్థ పురోభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసే ఉద్యోగులను గుర్తిస్తే రెట్టించిన ఉత్సాహం, అంకితభావంతో పని చేసే అవకాశం ఉంటుంది.

– సీహెచ్.రమేష్, టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గత ప్రభుత్వం నిలిపివేయడం బాధాకరం



రాష్ట్రానికి వెలుగులు పంచే విద్యుత్ ఉద్యోగుల పనితీరును అనేక మార్లు ప్రశంసించిన గత ప్రభుత్వం ఉద్యోగులకు మాత్రం అనాదిగా వస్తున్న లాభాల వాటా నిలిపివేసింది. ఇది బాధాకరమైన విషయం. ఆరేళ్లుగా లాభాల వాటా ఇవ్వకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై గతంలో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పుడు మళ్లీ పోరాడుతాం.

– దుగ్గిరాల సుధాకర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

విద్యార్థులకు కలెక్టర్ సూచన



క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

పాల్వంచ: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, తద్వారా జీవితంలో క్రమశిక్షణతో పాటు, ఉన్నత లక్ష్యాలను సాధించే అవకాశం ఉంటుందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. పట్టణంలోని శ్రీనివాస కాలనీ క్రీడా మైదానంలో ఆదివారం ఆయన జిల్లా స్థాయి టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి రోజు తెల్లవారుజామునే లేవడం దినచర్యగా అలవర్చుకుంటే క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. పిల్లలు కొండలను అధిరోహించేలా ప్రోత్సహించాలని, ప్రకృతికి దగ్గరగా తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు సూచించారు. తద్వారా వారిలో మానసికోల్లాసం పెంపొందించవచ్చని పేర్కొన్నారు. పాల్వంచలోని శ్రీనివాస కాలనీ గుట్ట, చండ్రుగొండ మండలంలోని పెద్దపాడులో ట్రెకింగ్ స్పాట్లను నెలలో ఒకటి, రెండుసార్లు వీక్షించాలన్నారు. క్రీడా రంగాన్ని అభివృద్ధి చేయడంలో తన సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్చరీ విభాగాన్ని సందర్శించి క్రీడాకారుల నైపుణ్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, డీవైఎస్‌ఓ పరంధామ రెడ్డి, ఏఎస్పీ విజయబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, చీఫ్ కోచ్ అన్నం వెంకటేశ్వర్లు, జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా మహమూద్ పాషా



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న పాషా

గుండాల: తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆళ్లపల్లి మండలం జాకారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మహమూద్ పాషా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రపంచ పర్యావరణ సంస్థ (డబ్ల్యూఈఓ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆవరణలో తెలంగాణ బెస్ట్ టీచర్ అవార్డు కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది ఉత్తమ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. వీరిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మహమూద్ పాషా ఎంపిక కావడం విశేషం. ఆయనకు డబ్ల్యూఈఓ అధ్యక్షుడు హరి ఇప్పనపల్లి, జిందాల్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత మనీష్ జిందాల్ చేతులమీదుగా షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమానికి తొమ్మిదో నిజాం మనుమడు నవాబ్ రౌనఖ్ యార్‌ఖాన్, ఎ.జ్యోత్స్నారావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారని పాషా 'సాక్షి'కి తెలిపారు.

ఏచూరి సేవలు వెలకట్టలేనివి

- కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయనో వేగుచుక్క
- సంస్మరణ సభలో పలువురి నివాళి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మధు, పక్కన వెంకట్ తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి సీతారాం ఏచూరి చేసిన సేవలు వెలకట్టలేనివని, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు చేస్తున్న సైద్ధాంతిక పోరాటాలకు ముగింపు లేదని మాజీ ఎంపీ, సీపీఎం ఏపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు అన్నారు. కొత్తగూడెంలోని కమ్మ కల్యాణ మండపంలో ఆదివారం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమానికే కాకుండా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి సైతం సీతారాం ఏచూరి విశేష సేవలందించారని కొనియాడారు. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత నిర్వహించిన అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల సదస్సుల్లోనూ ఏచూరి మాట్లాడారని, కష్టజీవులు, కార్మికులు ఉన్నంతవరకు కమ్యూనిజానికి, సోషలిజానికి మరణం లేదని చాటిచెప్పారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో సీతారాం వాదనలను అన్ని పార్టీల వారూ అంగీకరించేవారని చెప్పారు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు రాజకీయాల్లోకి వచ్చిన ఏచూరి కడవరకూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారని అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి కమ్యూనిస్టుల ఉమ్మడి ఆస్తి అని, ఏచూరి మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి, వామపక్ష రాజకీయాలకు తీరని లోటని అన్నారు. బతికున్నంత కాలం కమ్యూనిస్టు ఉద్యమానికి గౌరవ ప్రతిష్టలు అందించడమే కాక మరణం తర్వాత కూడా విశేష గౌరవం దక్కేలా ఆయన చర్యలు ఉపకరించాయని నివాళులర్పించారు. కమ్యూనిస్టులు ఐక్యమై పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించడమే ఆయనకు అందించే నివాళి అన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమమే కాదు, భారతదేశం ఒక గొప్ప రత్నాన్ని కోల్పోయిందని అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజంపై దాడి జరుగుతున్న ఈ సమయంలో ఏచూరి వంటి గొప్ప నేత లేకపోవడం దేశానికి తీరని లోటని చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా, న్యూడెమోక్రసీ నాయకులు మధు, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, కోనేరు సత్యనారాయణ, అనుదీప్, టీజేఎస్ నాయకులు మల్లెల రామనాథం, తాళ్లూరి వెంకటేశ్వరరావుతో పాటు మండవ సుబ్బారావు, వీరభద్రం, ఎంవీ చౌదరి, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ రామ్మోహనరావు, ఐలూ నాయకులు శివరాం, రమేష్‌కుమార్ మక్కడ్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఇల్లెందు: ఇల్లెందులో సుమారు రూ.22.2కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఇల్లెందుకు రానున్నారు. ముకుందాపురం – కట్టుగూడెం రోడ్డు, మేడికుంట – రామచంద్రాపురం రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఆతర్వాత ఇల్లెందులో చెరువుకట్ట వద్ద లేక్ వ్యూ పార్క్ సుందరీకరణ, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం, బుగ్గవాగు ప్రక్షాళన, మున్సిపల్ మోడల్ మార్కెట్‌లో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత చిల్డ్రన్స్ పార్క్‌ను ప్రారంభించి బొజ్జాయిగూడెంలోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో జిల్లా అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షిస్తారు. కాగా, మంగళవారం ఉదయం ఖమ్మం 1, 59వ డివిజన్లలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశాక కూసుమంచిలో నూతన జూనియర్ కళాశాలను ప్రారంభిస్తారు. అంతేకాక కూసుమంచి జెడ్పీహెచ్ఎస్‌లో అదనపు తరగతి గదులను ప్రారంభించనున్న మంత్రి పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తారు.

కదం తొక్కిన ఆటో కార్మికులు

ఆర్టీసీ బస్సులు వెళ్లలేని మారుమూల పల్లెలకూ వెళుతూ ప్రజా రవాణాలో పాలు పంచుకుంటున్న ఆటో, క్యాబ్ కార్మికులను ఆదుకోవాలంటూ కొత్తగూడెంలో ఆదివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఏఐటీయూసీ అనుబంధ ఆటో, క్యాబ్, ప్రైవేట్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర తృతీయ మహాసభల సందర్భంగా సాగిన ఈ ప్రదర్శనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై జీఎస్టీ పేరుతో పన్నుల భారం మోపుతోందని, తక్షణమే ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

– సూపర్‌బజార్(కొత్తగూడెం)



కొత్తగూడెంలో ఆటోలతో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు -వివరాలు 8లో

ఆకట్టుకునేలా ప్రచారం!

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం చేస్తోంది. ఈ మేరకు నిత్యం వందలాది మంది వచ్చే ఖమ్మం కలెక్టరేట్‌లో సంక్షేమ పథకాలను వివరించేలా బెలూన్లు సమకూర్చారు. ఇప్పటికే భారీ బెలూన్‌ను కలెక్టరేట్ పైభాగంలో ఎగురవేశారు. ఇక సబ్సిడీ గ్యాస్ పథకాన్ని వివరించేలా సిలిండర్ రూపంలో ఉన్న బెలూన్‌ను కలెక్టర్ చాంబర్ వైపు వెళ్లే దారిలో ఏర్పాటుచేశారు. ఈ బెలూన్‌పై ఆరు గ్యారంటీలతో ఇందిరాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ ఫొటోలు ఉన్నాయి. కాగా, ఇన్నాళ్లు బెలూన్లలో ఆక్సిజన్ నింపుతుండగా.. విద్యుత్ కనెక్షన్‌తో రూపం సంతరించుకునే సిలిండర్ బెలూన్‌ను పలువురు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. దీనిని హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులు జిల్లాలకు పంపించారని పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. – ఖమ్మం సహకారనగర్



పథకాల వివరాలతో రూపొందించిన సిలిండర్ రూపంలోని బెలూన్ (ఇన్‌సెట్) భారీ బెలూన్

క్లుప్తంగా

దేవాదాయ స్థలంలో పనులకు చెక్



పనులను అడ్డుకుంటున్న ఈఓ రజనీకుమారి

కొత్తగూడెంఅర్బన్: పట్టణంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన శ్రీ చిట్టి వారి సత్రం (దుర్గకళా మందిర్) స్థలంలో ఆదివారం ప్రైవేట్ వ్యక్తులు చేస్తున్న పనులను గణేశ్ టెంపుల్ ఈఓ ఎస్.రజనీకుమారి అడ్డుకున్నారు. హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఈఓ వివరించారు. పనులు నిలిపివేసి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండచిలువ పట్టివేత



కొండ చిలువను పట్టుకున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగులోని ఇళ్లలోకి శనివారం రాత్రి 10 అడుగుల కొండచిలువ రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు ప్రాణధార ట్రస్ట్, మున్సిపల్ స్నేక్ రెస్క్యూ సిబ్బంది సంతోష్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన స్నేక్ క్యాచర్ సంగయ్యను పంపించగా.. కొండచిలువను పట్టుకుని అడవిలో వదిలేశాడు.

వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ యయాతిరాజు కథనం ప్రకారం.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన పాకనాటి నాగేశ్వరరావు (50) శనివారం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. అనంతరం నేరుగా ఇంట్లోకి రావడంతో భార్య మందలించగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మద్యం మత్తులో ఉన్న నాగేశ్వరరావు ఇంట్లో ఉన్న పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చదువుపై ఆసక్తి లేక...

ఖమ్మంక్రైం: చదవడం ఇష్టం లేక యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మం మేదరబజార్‌కు చెందిన కోసత్రి లక్ష్మి(17) చదువుపై ఆసక్తి కనబర్చడం లేదు. దీంతో తల్లిదండ్రులు చదువుకోవాలని సూచించగా ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ ఎస్ఐ మౌలానా తెలిపారు.

గుండెపోటుతో డిప్యూటీ రేంజర్ మృతి



సురేశ్ (ఫైల్)

కొత్తగూడెంరూరల్ : లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ రేంజ్ అటవీ శాఖలో పనిచేస్తున్న డిప్యూటీ రేంజ్ అధికారి చందావత్ సురేశ్ ఆదివారం గుండెపోటుతో మరణించారు. స్థానిక మంచికంటి నగర్‌లో నివాసం ఉంటున్న ఆయనకు కుమారుడు, కూతురు ఉన్నారు. సురేశ్ హఠాన్మరణంతో అటవీ శాఖ సిబ్బంది, అధికారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా, సురేశ్ ఖమ్మం జిల్లా కారేపల్లి మండల వాసి అని కుటుంబసభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు...

ములకలపల్లి: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని మామిళ్లగూడెం గ్రామానికి చెందిన సడియం ప్రసాద్ తన మిత్రుడు మిడియం నిఖిల్‌తో కలిసి తాపీ నిమిత్తం ఈ నెల 20వ తేదీన పాల్వంచ వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో పాల్వంచ వైపు వస్తున్న కారు మాధారం అటవీ ప్రాంతంలో అతివేగంతో బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న ప్రసాద్ కాలుకు తీవ్రగాయాలు కాగా, నిఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు. ప్రసాద్ సోదరుడు సడియం నాగబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని గుర్రాలకుంట శివారు ముర్రేడు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాడి చేసి, ఎలాంటి అనుమతిపత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశామని, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆ రైళ్లు.. పట్టాలెక్కేనా?



భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్

- రద్దయిన ఏడు రైళ్లలో నాలుగే రాకపోకలు
- బెల్గావి రద్దుతో అవస్థలు..
- ఆదాయానికే అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి రాకపోకలు పెరిగిపోయాయి. భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికులు, వ్యాపార వర్గాల అవసరాలకు తగ్గట్టుగా రైళ్లు నడవకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేల రూపాయలు ఖర్చు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకొని వాటిల్లో ప్రయాణం చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతం కావడంతో నిత్యం ఉద్యోగులు, వ్యాపారం కోసం, వివిధ అవసరాల కోసం వచ్చి వెళ్లే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అవసరాలకు తగ్గట్టుగా రైల్వే శాఖ రైళ్లను నడపకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. కేవలం ఆదాయానికే ప్రాధాన్యమిస్తూ ప్రయాణికుల సౌకర్యాలను గాలికి వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దక్షిణ మధ్య రైల్వేలో ఏడాదికి అత్యధిక ఆదాయాన్ని భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి పొందుతున్నట్లు సమాచారం. బొగ్గు రవాణా ద్వారా ఏడాదికి సుమారు రూ.650 కోట్లకుపైగా ఆదాయం పొందుతున్న రైల్వే శాఖ స్థానికులకు ప్రయాణ సౌకర్యం కల్పించడంలో విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కరోనా సమయం నుంచి బీడీసీఆర్ (భద్రాచలంరోడ్డు) స్టేషన్ నుంచి నడిచే రైళ్లు పూర్తిస్థాయిలో ప్రయాణికులకు సేవలందించడం లేదు. గతేడాది నుంచి పలుమార్లు రైళ్లను రద్దు చేస్తూవస్తున్నారు. కరోనా సమయంలో రద్దు చేసిన కొన్ని రైళ్లను ఇంతవరకు పునరుద్ధరించలేదు. దీంతో పాటు సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైలును కూడా పలుమార్లు రద్దు చేస్తూ, మరికొన్ని రోజులు కొద్ది దూరమే నడపడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రద్దయిన రైళ్లను ప్రారంభించాలని కోరుతూ కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేయడం సర్వసాధారణమైపోయింది.

రద్దుతో అవస్థలు..

బీడీసీఆర్ స్టేషన్ నుంచి నడిచే రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరోనా సమయం నుంచి మొదలైన రైళ్ల రద్దు.. ఇంకా కొనసాగిస్తుండటంతో అన్ని వర్గాల వారికి ఇబ్బంది కలుగుతోంది. గతంలో బీడీసీఆర్ స్టేషన్ నుంచి ఏడు రైళ్లు రాకపోకలు సాగించేవి. సింగరేణి ఎక్స్‌ప్రెస్, డోర్నకల్ ప్యాసింజర్, విజయవాడ ప్యాసింజర్, కాజీపేట ప్యాసింజర్, కాకతీయ ప్యాసింజర్, కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్, మణుగూరు సూపర్‌ఫాస్ట్ సర్వీసులు నడిచేవి. ప్రస్తుతం మణుగూరు సూపర్‌ఫాస్ట్, సింగరేణి ఎక్స్‌ప్రెస్, కాకతీయ ఎక్స్‌ప్రెస్, విజయవాడ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. బెల్గావి రైలు గత జనవరి నెల నుంచి రద్దు చేశారు. కొత్త రైళ్లు ఏర్పాటు చేయకపోగా, ఉన్న రైళ్లను రద్దు చేయడం సరికాదని ప్రయాణికులు వాపోతున్నారు. ఒక రైలును పునరుద్ధరిస్తూ, మరో రైలును రద్దు చేయడం దారుణమని ప్రయాణికులు మండిపడుతున్నారు.

ప్రత్యేక రైళ్లు నడుపుతారా?

అక్టోబర్ 2వ తేదీ నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. దీంతో ప్రయాణికుల రాకపోకలు మామూలు రోజుల కంటే పెరుగుతాయి. దీంతో రద్దయిన రైళ్లతో పాటుగా సెలవుల నేపథ్యంలో కొన్ని ప్రత్యేక రైళ్లను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో మహిళల రద్దీ అధికంగా ఉంటోంది. పండుగ సమయంలో రద్దీ పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రత్యామ్నాయంగా రైళ్లలో ప్రయాణించేందుకు ఆసక్తి చూపే అవకాశం ఉన్నందున రైళ్ల సంఖ్యను పెంచాల్సిన అవసరముంది. తిరుపతి, షిర్డీ వంటి పుణ్యక్షేత్రాలకు ఎప్పటినుంచో ప్రయాణికుల నుంచి అధిక డిమాండ్ ఉన్నప్పటికీ రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలో ఎమ్మెల్యే కూనంనేని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆర్టీసీ సంస్థకు దీటుగా మారుమూల పల్లెలకు సైతం ప్రజారవాణాలో పాలుపంచుకుంటున్న ఆటో, క్యాబ్ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఏఐటీయూసీ అనుబంధ ఆటో, క్యాబ్, ప్రైవేట్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర తృతీయ మహాసభలు స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభం సందర్భంగా కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ నుంచి కొత్తగూడెం క్లబ్ వరకు కార్మికులు తమ ఆటోలు, ప్రైవేట్ వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. క్లబ్ ఆవరణలో ఏఐటీయూసీ జాతీయ నాయకులు టీఎస్ బోస్ జెండా ఆవిష్కరించి, మహాసభలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రవాణారంగ కార్మికులను దోచుకోవడమే పనిగా పెట్టుకుందని, రోడ్డు సేఫ్టీ చట్టాలు, అపరాధ రుసుంలు, పన్నుల పేరుతో కార్మికుల జేబులు కొల్లగొడుతూ ఖజానా నింపుకుంటోందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచి కార్మికుపై భారం మోపుతోందని, అన్నింటిపై జీఎస్టీ విధిస్తున్న కేంద్రం పెట్రోల్, డీజిల్‌పై ఎందుకు విధించదో సమాధానం చెప్పాలని నిలదీశారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు తరహాలో దేశవ్యాప్తంగా లక్షలాదిగా ఉన్న రవాణారంగ కార్మికులకు సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని ఉద్యమిస్తున్నా కేంద్రం పెడచెవిన పెడుతోందని ఆక్షేపించారు. ఏఐటీయూసీ అనుబంధంగా ఏర్పడిన ఆటోరిక్షా వర్కర్స్ యూనియన్ ఐదు దశాబ్దాలుగా కార్మికుల పక్షాన పోరాడుతోందని వెల్లడించారు. కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన మహాసభల్లో సీపీఐ, ఏఐటీయూసీ నేతలు సాబీర్‌పాషా, ఎస్.బాలరాజు, బి.వెంకటేశ్, నరాటి ప్రసాద్ ప్రసంగించగా ముత్యాల విశ్వనాథం, కె.సారయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్‌డీ సలీం, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, పేరబోయిన మోహన్‌రావు, దేవరకొండ శంకర్, వి.పూర్ణచందర్‌రావు, జి.రామకృష్ణ, భూక్య దస్రు, కందుల భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థినిపై దాడి.. కేసు నమోదు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన మనోహర్ అనే బాలుడు అదే కాలనీకి చెందిన ఓ బాలిక ముఖంపై ఈనెల 20న దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ పీవీఎన్ రావు తెలిపారు. మనోహర్ బాలికపై పిడిగుద్దులకు పాల్పడిన కాసేపటి తర్వాత ఫిట్స్ వచ్చినట్లు అపస్మారకస్థితిలోకి వెళ్లింది. ఈ మేరకు ఆదివారం ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. బాలికకు ఫిట్స్ రావడంతో తల్లిదండ్రులు పట్టణంలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. అక్కడి నుంచి ఆదివారం ఉదయం భద్రాచలం వచ్చాక బాలిక తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మనోహర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి చేసినవారిపై...

పాల్వంచ: వినాయక నిమజ్జనం సందర్భంగా ఉరేగింపులో జరిగిన ఘర్షణలో నలుగురిపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని మంచికంటినగర్‌లో ఈ నెల 17వ తేదీ రాత్రి సమయంలో వినాయక విగ్రహ ఉరేగింపు జరిగింది. ఈ క్రమంలో పాటలు పెట్టి డ్యాన్స్‌లు వేస్తున్నారు. పాటలు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని అడిగిన వడ్లమూడి ఆనంద్, కరుణ, విజయ్, నీలావతి దంపతులపై కోటి, కౌశిక్, ప్రేమ్‌కిరణ్, అఖిల్‌లు దాడి చేశారు. గాయపడినవారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆదివారం ఆనంద్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సుమన్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

దమ్మపేట: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ (పల్లెవెలుగు) బస్సు ఢీ కొట్టిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని వైజాగ్‌కు చెందిన కొండపల్లి కృష్ణచైతన్య ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మండల పరిధిలోని మందలపల్లి గ్రామ శివారుకు చేరుకోగానే అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కృష్ణచైతన్యను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లారీని ఢీకొట్టిన కారు



అశ్వారావుపేటరూరల్: ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘటన శనివారం అర్ధరాత్రి మండలంలో చోటుచేసుకుంది. అశ్వారావుపేట వైపు నుంచి జంగారెడ్డిగూడెం మార్గంలో వెళ్తున్న కారు స్థానిక పేపర్ బోర్డు సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న యువకుడికి ఎలాంటి గాయాలు కాలేదు. కారు ముందు భాగం ధ్వంసమైంది.

నేలకొరిగిన భారీ చింతచెట్టు



రహదారికి అడ్డంగా పడిన చింతచెట్టు

దుమ్ముగూడెం: తీవ్రమైన గాలులు వీయడంతో మండలంలోని చిన్నబండిరేవు గ్రామ శివారు భద్రాచలం – చర్ల ప్రధాన రహదారిలో భారీ చింతచెట్టు నేలకొరిగింది. ఆదివారం మధ్యాహ్నం మొదలైన గాలులు చింతచెట్టు రహదారిపై పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రెండు వైపులా వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటప్పయ్య జేసీబీ సాయంతో చింతచెట్టును పక్కకు తొలగించి, రాకపోకలు పునరుద్ధరించారు.

తిరుమల లడ్డూ ప్రసాదంలో పొగాకు ప్యాకెట్

నివ్వెరపోయిన భక్తులు





లడ్డూ ప్రసాదంలో పొగాకుతో కూడిన ప్యాకెట్, ప్రసాదాన్ని చూపిస్తున్న పద్మావతి

ఖమ్మంరూరల్: దేవదేవుడు, కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం అనంతరం తీసుకొచ్చిన లడ్డూలో పొగాకుతో కూడిన ప్యాకెట్ రావడంతో భక్తులు నివ్వెరపోయిన ఘటన ఇది. ఖమ్మం రూరల్ మండలంలోని గొల్లగూడెం గ్రామపంచాయతీ శివారు కార్తికేయ టౌన్‌షిప్‌కు చెందిన దొంతు పద్మావతి బంధువులతో కలిసి ఈనెల 19న తిరుమల వెళ్లారు. అక్కడ 20వ తేదీన సర్వదర్శనం ద్వారా స్వామిని దర్శించుకున్నాక లడ్డూలు కొనుగోలు చేయగా ఆదివారం తెల్లవారుజామున ఇంటికి చేరుకున్నారు. కాగా, ఉదయం లడ్డూ ప్రసాదాన్ని ఇంట్లో దేవుడి వద్ద ఉంచి బంధువులకు ఇచ్చేందుకు ముందు కొద్దిగా నోట్లో వేసుకోగా పొగాకు వాసన వచ్చింది. దీంతో పద్మావతి లడ్డూ మొత్తం చూడగా అందులో పొగాకుతో కూడిన ప్యాకెట్ కనిపించింది. కాస్త నమిలిన పొగాకును కాగితంలో చుట్టగా అది లడ్డూలో కలిసిపోయి ఉంది. దీంతో ఆమె పలువురికి చూపించగా పద్మావతితో పాటు వెళ్లిన మిగతా వారు తీసుకొచ్చిన వారు తెచ్చిన లడ్డూలు బాగానే ఉన్నాయి. కాగా, పవిత్రమైన శ్రీవారి ప్రసాదంలో ఇలా రావడంపై పద్మావతి సహా పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



కౌసల్య (ఫైల్)

టేకులపల్లి: పురుగులమందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ పి.సురేశ్ కథనం ప్రకారం.. మండలంలోని బద్దుతండా పంచాయతీ మద్దిరాలతండాకు చెందిన బాదావత్ కౌసల్య (49) ఏడేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. డయాలసిస్ చేయించుకుంటోంది. వ్యాధి తగ్గకపోవడంతో మనస్తాపానికి గురైన ఆమె ఈ నెల 20న రాత్రి గుర్తు తెలియని పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలికి భర్త భీక్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నాగార్జున ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పరంజా పైనుంచి పడి తాపీ మేస్త్రి...



జానీ మృతదేహం

దమ్మపేట: తాపీ పని చేస్తూ పరంజా పైనుంచి జారిపడి ఓ మేస్త్రి మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. రాచూరుపల్లి గ్రామానికి చెందిన సోయం జానీ (47) అదే గ్రామంలోని చర్చి భవన నిర్మాణంలో తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. పరంజాపై నిలబడి పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. జానీని సత్తుపల్లి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు రాచూరుపల్లి గ్రామస్తులు తెలిపారు.

బుగ్గవాగులో పడి పశువుల కాపరి...

కారేపల్లి: పశువులను కాసేందుకు వెళ్లిన కాపరి ప్రమాదవశాత్తు బుగ్గవాగులో పడి మృతి చెందిన ఘటన మండలంలోని రొట్టమాకురేవు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తొలెం ముత్యాలు(75) పశువులను తీసుకెళ్లి బుగ్గవాగు సమీపాన మేపుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి వాగులో పడ్డాడు. ఈ మేరకు ఆయన ప్రవాహంలో కొట్టుకుపోతుండగా చుట్టుపక్కల రైతులు చేరుకుని కాపాడే ప్రయత్నం చేసినాఫలితం కానరాలేదు. అనంతరం వాగులో గాలిస్తూ కొద్దిదూరాన కనిపించిన ముత్యాలును బయటకు తీసుకొచ్చేసరికి మృతి చెందాడు. ఘటనపై ఆయన కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న హీరోయిన్లు నేహాశెట్టి, పాయల్ రాజ్‌పుత్

సందడి చేసిన సినీతారలు నేహాశెట్టి, పాయల్ రాజ్‌పుత్



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, తదితరులు

చుంచుపల్లి: సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యం తన 36వ షోరూమ్‌ను కొత్తగూడెం విద్యానగర్‌లో ఏర్పాటుచేయగా ఆదివారం ప్రారంభించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో పాటు సినీ తారలు నేహాశెట్టి, పాయల్ రాజ్‌పుత్ హాజరయ్యారు. షోరూమ్‌ను ప్రారంభించాక సినీ తారలు పట్టుచీరలను పరిశీలిస్తూ వేదికపై కొద్దిసేపు అభివాదం చేయడమే కాక నృత్యంతో అభిమానులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి కొత్తగూడెం రావడం ఆనందంగా ఉందని తెలిపారు. దేశంలోనే పేరొందిన షాపింగ్ మాల్ వినియోగదారులకు సాటిలేని నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తోందని వెల్లడించారు. జెడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, షోరూం డైరెక్టర్లు సురేష్ శీర్ల, అభినయ్, రాకేష్, కేశవ్, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, చుంచుపల్లి సీఐ ఆర్.వెంకటేశ్వర్లుతో పాటు బాదావత్ శాంతి, సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కేయూ ఇంటర్ కాలేజీ టోర్నమెంట్

వివిధ క్రీడల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థుల ప్రతిభ




బాడ్మింటన్‌లో రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న కొత్తగూడెం ఎస్‌సీడబ్ల్యూ డిగ్రీ కాలేజీ జట్టు


మామునూరు: క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, మామునూరు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న కాకతీయ యూనివర్సిటీ స్థాయి మహిళల ఇంటర్ కాలేజీ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖో–ఖో, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, చెస్ పోటీలు నిర్వహించగా విజేతలకు కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్ వాణి, ఇన్‌స్పెక్టర్ రవికుమార్ బహుమతులు అందజేశారు.

విజేతల వివరాలు..

క్రాసకంట్రీలో కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కాలేజీ జట్టు విజేతగా నిలవగా ఉట్నూరులోని టీటీడబ్ల్యూఆర్‌డీసీ జట్టు రెండో స్థానంలో నిలిచింది. బాడ్మింటన్‌లో వరంగల్ కిట్స్ జట్టు విజేతగా నిలవగా, కొత్తగూడెంలోని ఎస్‌సీడబ్ల్యూ డిగ్రీ కాలేజీ జట్టు రెండో స్థానంలో నిలిచాయి. బాస్కెట్‌బాల్‌లో వరంగల్ కిట్స్, ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ జట్లు, హ్యాండ్‌బాల్‌లో వరంగల్‌లోని కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ, వరంగల్ టీజీడబ్ల్యూఆర్‌డీసీ జట్లు, కబడ్డీలో హనుమకొండ కేడీసీ, కొత్తగూడెంలో టీటీడబ్ల్యూఆర్‌డీసీ జట్లు, ఖో–ఖోలో కేయూ యూసీపీఈ, కొత్తగూడెం టీటీడబ్ల్యూఆర్‌డీసీ జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. అలాగే, టేబుల్ టెన్నిస్‌లో వరంగల్ కిట్స్, కొత్తగూడెం ఎస్‌సీడబ్ల్యూ డిగ్రీ కాలేజీ జట్లు, వాలీబాల్‌లో వరంగల్‌లోని కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ, కొత్తగూడెంలోని టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ జట్లు, చెస్‌లో ఉట్నూరులోని టీటీడబ్ల్యూఆర్‌డీసీ, వరంగల్ కిట్స్ మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ





చినజీయర్ స్వామి చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న నవనీత్, రక్షిత

చింతకాని: శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి నేతృత్వంలోని అనుబంధ ప్రజ్ఞావికాస్ సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో చింతకాని మండలం నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయం పదో తరగతి విద్యార్థి జక్కుల నవనీత్ ప్రథమ బహుమతి సాధించాడు. హైదరాబాద్ ముచ్చింతల్‌లోని చినజీయర్ స్వామి ఆశ్రమంలో శనివారం పోటీలు నిర్వహించగా రాష్ట్రవ్యాప్తంగా 380మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో నవనీత్ ప్రథదమ స్థానంలో నిలవగా చినజీయర్ స్వామి రూ.13 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. ట్రస్మా రాష్ట్ర బాధ్యుడు యాదగిరి శేఖర్‌రావు, పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

యూనివర్సల్ విద్యార్థిని ప్రతిభ

తల్లాడ: జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో తల్లాడలోని యూనివర్సల్ విద్యాలయం ఏడో తరగతి విద్యార్థి రక్షిత చిత్రలేఖనం విభాగంలో ప్రథమ బహుమతి సాధించగా చినజీయర్ స్వామి ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందజేశారు. ఆమెను యూనివర్సల్ కరస్పాండెంట్ టీ.కే.ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సోఫియా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ యాకూబ్‌తో పాటు ఉపాధ్యాయులు మోహన్, రవి, పీఈటీ నాగేశ్వర్‌రావు అభినందించారు.

రోడ్డుప్రమాదంలో నలుగురికి గాయాలు

రఘునాథపాలెం: మండలంలోని ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై బూడిదంపాడు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని పువ్వాడనగర్‌కు చెందిన షేక్ ఇషాక్, షేక్ బాబాతోపాటు మరొకరు ఆదివారం సాయంత్రం బూడిదంపాడు వైపు వెళ్తుండగా ఎదురుగా పండితాపురం వైపు నుండి వచ్చిన వస్తున్న నీలం గోపి బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన నలుగురిని ఆస్పత్రికి తరలించారు. అయితే, ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా, ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

జరగని తప్పుపై రాద్ధాంతం

భక్తుల మనోభావాలకు తీవ్ర విఘాతం

- వాస్తవాలతో ప్రధానికి రాసిన లేఖను అందరూ చదవండి
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారని, తీవ్ర విఘాతం కలిగిస్తున్నారని.. ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. హిందూ భక్తుల మత పరమైన మనోభావాలను ఏ విధంగా దెబ్బ తీస్తున్నారనే విషయంపై వాస్తవాలను వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖలో పొందు పరిచానని, దయచేసి అందరూ ఆ లేఖను చదివి వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆ పోస్టును దేశంలోని ప్రముఖ హిందూ దేవాలయాలు, ధార్మిక సంస్థలు, ఆధ్యాత్మిక వేత్తలకు ట్యాగ్ చేశారు. వైఎస్ జగన్ ట్యాగ్ చేసిన వాటిలో.. తిరుమల తిరుపతి దేవస్థానం, ఆర్ఎస్ఎస్, పూరి జగన్నాథాలయం, కాశీ విశ్వనాధాత్రి, షిర్డీ సాయిబాబు, సద్గురు జగ్గీ వాసుదేవ్, గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్, స్వామి ముకుందానంద, గురు గోపాల్ దాస్, బ్రహ్మకుమారి బీకే శివాని, యోగి స్వామి రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ, జయ కిషోరి, స్వామి అవధేషానంద్, చిదంబరం నటరాజ్ టెంపుల్, శృంగేరి మఠం, గోవర్ధన మఠం, రాజస్థాన్ జై శ్రీ నీలకంఠ మహదేవ్, కాశీ విశ్వనాథ్ టెంపుల్, ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగ్, మహదేవ్ జ్యోతిర్లింగ్, శ్రీ ద్వారకాదీష్ టెంపుల్, శ్రీ నీలకంఠ మహదేవ్ టెంపుల్, పండరీపురం విఠల్ రుక్మిణీ టెంపుల్, తిరుచెందూర్ సుబ్రమణ్య టెంపుల్, కంచిమఠం, రామకృష్ణ మఠం, ఇస్కాన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, బ్రహ్మకుమారీస్, చిన్మయ మిషన్ ఉన్నాయి. ఇంకా దేశంలోని వివిధ రాజకీయ పార్టీలు, మీడియా సంస్థలకు సైతం ట్యాగ్ చేశారు.

▶ మొదటి పేజీ తరువాయి

లేదని చెప్పారు. వాస్తవం ఇలా ఉండగా కోట్లాది మంది హిందూ భక్తుల మదిలో అనుమానాలు సృష్టించిన చంద్రబాబును మందలించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు చర్యలు ముఖ్యమంత్రి పదవికే కాకుండా ప్రజా జీవితంలో ఉన్న ప్రతి ఒక్కరి స్థాయిని దిగజార్చాయని, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన టీటీడీని, ఆ సంస్థ అనుసరిస్తున్న పద్ధతుల ఔన్నత్యాన్ని దెబ్బ తీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల విశ్వాసాలను, టీటీడీ ఔన్నత్యాన్ని దెబ్బతీసేలా అబద్ధాలను వ్యాప్తి చేసి, నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్న చంద్రబాబును గట్టిగా చీవాట్లు పెట్టాలని కోరారు. ఈ మేరకు ప్రధాని మోదీకి వైఎస్ జగన్ ఆదివారం లేఖ రాశారు. ఆ లేఖలో ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి.

ప్రజల దృష్టి మళ్లించడానికే..

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పవిత్రతను, ప్రతిష్టను కోలుకోలేని విధంగా దెబ్బ తీసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయత్నాలు చేస్తున్నారు. శ్రీ వెంకటేశ్వరస్వామికి భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఉన్నారు. ఈ వ్యవహారాన్ని జాగ్రత్తగా చూడకపోతే పరిస్థితులు దిగజారే ప్రమాదం ఉంది. చంద్రబాబు చెబుతున్న అబద్ధాలు అందరికీ వ్యాపించి, తీవ్ర వేదనను కలిగిస్తాయి. భవిష్యత్తులో కూడా అనేక పరిణామాలకు దారి తీస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా, గొప్పలు చెప్పుకునేందుకు టీడీపీ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కానీ కొత్త ప్రభుత్వం పట్ల ప్రజాభిప్రాయం ప్రతికూలంగా ఉంది. ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలను, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో, నిలబెట్టుకోవడంలో కొత్త ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ నేపథ్యంలో ప్రజల దృష్టిని మరల్చడానికే టీటీడీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చంద్రబాబు పచ్చి అబద్ధాలను ప్రచారం చేశారు. కోట్లాది మంది భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని తప్పుడు ఆరోపణలు చేశారు. కేవలం రాజకీయ స్వార్థంతోనే చంద్రబాబు ఇలా దారుణంగా ప్రచారం చేశారు.

కల్తీ నెయ్యిని లడ్డూ తయారీలో వాడనేలేదు

కల్తీ జరిగిందనే ఆరోపణలతో తిరస్కరించిన నెయ్యి ట్యాంకర్లు 2024 జూలై 12న తిరుమలకు వచ్చాయి. ఆ ట్యాంకర్లలోని నెయ్యిని లడ్డూ తయారీలో వాడలేదు. దశాబ్దాలుగా టీటీడీలో ఉన్న అత్యుత్తమ విధానాల వల్ల నెయ్యిలో సందేహాస్పద పదార్థాలు ఉంటే వెంటనే గుర్తిస్తారు. అలా ట్యాంకర్లు వెనక్కి పంపారని, ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వాడలేదని తెలిసి కూడా చంద్రబాబు బాధ్యతా రాహిత్యంగా వ్యాఖ్యలు చేశారు.



టీటీడీ బోర్డు స్వతంత్ర సంస్థ

శ్రీవారి ఆలయం అవసరాలకు సంబంధించి ఎలాంటి కొనుగోళ్లు జరిపినా, వాటి విషయంలో టీటీడీ దశాబ్దాలుగా అత్యుత్తమ విధానాలు అనుసరిస్తోంది. శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ వ్యవహారాలన్నింటినీ కూడా టీటీడీ బోర్డ్ పర్యవేక్షిస్తుంది. ఇది స్వతంత్ర సంస్థ. తిరుమల ఆలయ వ్యవహారాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాత్ర పరిమితంగా ఉంటుంది. ధర్మకర్తల మండలిలో భక్తులు, వేర్వేరు రంగాల్లో ఆధ్యాత్మిక ప్రముఖులు సభ్యులుగా ఉంటారు. కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇలాంటి వారిని టీటీడీ సభ్యులుగా సిఫార్సు చేస్తారు. ఇటీవలి టీటీడీ బోర్డులో బీజేపీకి సంబంధించిన సభ్యులు కూడా ఉన్నారు.

టీటీడీ ప్రతిష్టను ఇనుమడింపజేసింది మేమే

నిజానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ చేపట్టిన కొన్ని చర్యల పట్ల నేను గర్వపడుతున్నాను. ఆలయంలో వినియోగించే నెయ్యి సహా సరుకుల స్వచ్ఛత, నాణ్యతలపై పరీక్షలు జరపడానికి ప్రయోగశాలలను బలోపేతం చేశాం. ఈ విషయంలో ప్రఖ్యాత సీఎఫ్‌టీఆర్ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) సేవలను టీటీడీ తీసుకుంది.

- నవనీత సేవను ప్రారంభించడమే కాకుండా, శుద్ధ నెయ్యి సరఫరా కోసం తిరుమలలో గోశాలను స్థాపించాం.
- టీటీడీ అర్చకుల జీతాలు రెట్టింపు చేశాం. టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు అందించాం.
- జమ్మూలో మాతా వైష్ణో దేవి పుణ్యక్షేత్రానికి సమీపంలో టీటీడీ ఆలయం నిర్మించాం. 2023లో దీన్ని ప్రారంభించామని గుర్తు చేస్తున్నాం. ముంబై, రాయ్‌పూర్, అహ్మదాబాద్‌లలో బాలాజీ కొత్త ఆలయాల నిర్మాణం ప్రారంభించాం.

స్వచ్ఛమైన ఆవు నెయ్యి, ముడి సరుకులు కొనుగోలు

- టీటీడీ అవసరాలకు అవసరమైన ఆవు నెయ్యి కొనుగోలు కోసం ఇ- టెండర్ ప్రక్రియను అనుసరిస్తోంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి టెండర్ పక్రియను చేపడుతుంది. టెండర్ పక్రియలో పేర్కొన్న నియమ నిబంధనలు, ప్రమాణాలకు అనుగుణంగా సరఫరా సంస్థను ఎంపిక చేస్తుంది. ఆమోదం కోసం టీటీడీ బోర్డు ముందు ఉంచుతారు. టీటీడీలో కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది.
- 2014-2019 మధ్య టీడీపీ హయాంలో కూడా అదే పద్ధతి ఉంది. నెయ్యిని వినియోగించే ముందు దాని నాణ్యతను పరిశీలించడానికి తనిఖీ వ్యవస్థలు కూడా ఉన్నాయి.
- అలాగే ఆలయంలోని వెళ్లే ముందు ప్రతి ట్యాంకర్ నుండి మూడు నమూనాలు తీసుకుని పరీక్షిస్తారు. ఈ మూడు శాంపిళ్లలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత మాత్రమే నెయ్యిని ఉపయోగించడానికి అనుమతిస్తారు. ఏ పరీక్షల్లోనైనా సందేహాస్పద పదార్థాలు కనిపిస్తే ఆ ట్యాంకర్‌ను తిరస్కరిస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించరు. ఇలాంటి అత్యుత్తమ విధానాలు పాటిస్తున్నందు వల్ల ప్రసాదాల తయారీలో నాణ్యత లేని పదార్థాలను ఉపయోగిస్తున్నారనే ప్రశ్నే తలెత్తదు.
- 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో 14 నుంచి 15 సార్లు ట్యాంకర్లను ఇలాగే తిరస్కరించారు. 2019-24 మధ్య వైఎస్సార్‌సీపీ హయాంలో 18 సార్లు ట్యాంకర్లను తిరస్కరించారు. అటువంటి ధృఢమైన విధానాలు, పద్ధతులు అమలులో ఉన్నందున, కల్తీ నెయ్యితో ప్రసాదాలు తయారీకి ఆస్కారమే లేదు. ఈ విధానం గత కొన్ని దశాబ్దాలుగా టీటీడీలో అమలులో ఉంది. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న చంద్రబాబు.. టీటీడీలో పాటిస్తున్న అత్యుత్తమ విధానాల గురించి, టీటీడీ ప్రతిష్ట గురించి ప్రజలకు చెప్పాల్సింది పోయి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. సామాజిక బాధ్యత లేకుండా వ్యవహరించారు.
- గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో, ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ట్యాంకర్లను తిరస్కరించిన పద్ధతుల్లో భాగంగానే జూలై నెలలో కూడా నెయ్యి ట్యాంకర్లను తిరస్కరించారు. తిరస్కరించిన ట్యాంకర్లను ఆధారంగా చేసుకుని 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంలో టీడీపీ రాజకీయ సమావేశంలో చంద్రబాబు సున్నితమైన ఈ అంశంపై బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు రాజకీయ ఉద్దేశాలు ఇట్టే అర్థం అవుతున్నాయి. కచ్చితంగా ఇది నేరం.

నిర్ధారించుకోకుండా ఆరోపణలా?

- ఎన్‌డీడీబీ కాఫ్ లిమిటెడ్ నుంచి వచ్చిన నివేదికలో పేర్కొన్న ఎస్ - విలువలు నిర్దేశించిన విలువల పరిమితి కన్నా తక్కువ ఉండడంపై ల్యాబ్ కొన్ని సందేహాలను వ్యక్తం చేసింది. ఏయే పరిస్థితుల్లో ఈ పరీక్షలు తప్పు కావచ్చనే అంశాన్ని కూడా స్పష్టంగా పేర్కొంది. తాము ఇచ్చిన రిజల్ట్స్‌లో కొన్ని సందర్భాల్లో కచ్చితత్వం లోపించే అవకాశం ఉందని అందులో ఉంది.
- పోషకాహార లోపం ఉన్న ఆవుల నుంచి వచ్చే పాలతో తయారు చేసే నెయ్యి వల్ల, వెజిటబుల్ ఆయిల్స్‌ను ఆహారంగా తీసుకునే ఆవుల నుంచి వచ్చే పాలతో తయారు చేసిన నెయ్యి వల్ల, వేర్వేరు విధానాలతో తీసే నమూనాల వల్ల కచ్చితత్వం లోపిస్తుందని నివేదికలో ఉంది. పైన పేర్కొన్న పరిస్థితుల్లో ల్యాబ్ పరీక్షల్లో తప్పుడు ఫలితాలు వస్తాయని పేర్కొంది.
- పోషకాహార లోపం ఉన్న ఆవు నుండి వచ్చే పాల నుంచి నెయ్యి పొందినట్లయితే లేదా పామాయిల్ అధికంగా తినిపించిన ఆవు పాల నుంచి నెయ్యి పొందినట్లయితే, జంతువు కొవ్వు ఉనికిని సూచించే పరీక్షల్లో కచ్చితత్వంతో సరైన ఫలితాలు కొనుగొనేందుకు అవకాశాలు ఉండవు. పరీక్షల్లో కచ్చితత్వంపై నిర్ధారణ లేకుండా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి ఆరోపణలు చేయకూడదు.
- ప్రజా జీవితంలో తనకు అపారమైన అనుభవం ఉందంటూ పదే పదే గొప్పలు చెప్పుకునే చంద్రబాబునాయుడు లాంటి వ్యక్తి.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన టీటీడీ లాంటి సంస్థ అంకిత భావాన్ని, పవిత్రతను, కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బ తీసేందుకు అవకాశం ఉండే ఇలాంటి అంశాలపై తప్పుగా మాట్లాడకూడదు. ఎన్‌డీడీబీ పరీక్షల నివేదికను ఈ లేఖకు జత చేస్తున్నాను. పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

టీడీపీ హయాంలోనూ కేఎంఎఫ్ సరఫరా చేయలేదు

- కొన్నేళ్లుగా తిరుమలలో కర్ణాటక కో ఆప్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (కేఎంఎఫ్) నెయ్యి సరఫరా చేసేదని, దాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలిపేసిందని టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇది పూర్తిగా సత్యదూరం.
- 2014-19 మధ్య టీటీడీ నిర్వహించిన టెండర్లలో కేఎంఎఫ్ కొన్నిసార్లు మాత్రమే టెండర్లలో పాల్గొంది. వాస్తవానికి టీడీపీ అధికారంలో ఉన్న 2015 నుంచి 2018 అక్టోబర్ వరకు కేఎంఎఫ్ టీటీడీకి నెయ్యి సరఫరా చేయకపోవడం గమనార్హం.

రెండు నెలల తర్వాత టీడీపీ ఆఫీసులో పరీక్ష నివేదిక విడుదల

చంద్రబాబుది చిత్తశుద్ధి లేని, కపట వైఖరి అని చెప్పడానికి మరో అంశాన్ని ప్రస్తావిస్తున్నా. 2024 జూలై 12వ తేదీన తిరుమలకు చేరుకున్న నెయ్యి ట్యాంకర్‌లోని నమూనాలు సందేహాస్పదంగా ఉన్నాయని, మూడు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయాయని, వాటి నమూనాలను కూడా పంపినట్లు బహిరంగంగా వెల్లడించారు. ఆ తర్వాత ఆ నమూనాలను ఎన్‌డీడీబీ కాఫ్ 2024 జూలై 17న పంపింది. వాటిని పరిశీలించి, పరీక్షలు చేసి విశ్లేషించిన ఫలితాలను 2024 జూలై 23న నివేదించారు. నెయ్యి కల్తీ జరిగిందన్న సందేహాలు వ్యక్తమైన ట్యాంకర్లు టీటీడీ ఆవరణలోకే అనుమతించ లేదన్న విషయాన్ని ఇక్కడ గమనించాలి. ఏది ఏమైనప్పటికీ చంద్రబాబు భక్తుల మనోభావాలను పూర్తిగా పట్టించుకోకుండా రాజకీయ ఉద్దేశాలతో అసత్యాలను ప్రచారం చేశారు. దుర్మార్గపు ఉద్దేశాలతో వ్యవహరించారు. 2024 సెప్టెంబరు 18న జరిగిన రాజకీయ పార్టీ సమావేశంలో ఈ అంశాన్ని వెలుగులోకి తెచ్చారు. ట్యాంకర్ తిరస్కరించిన రెండు నెలల తర్వాత టీడీపీ కార్యాలయం నుంచి ల్యాబ్ నివేదిక విడుదల చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పవిత్రతను కించ పరిచేలా మొత్తం ఈ అంశాన్ని రాజకీయ లక్ష్యాల సాధన కోసం ఉపయోగించుకునేందుకు వేసిన పథకం ఇది. చంద్రబాబు బాధ్యతా రాహిత్య వైఖరిని ఇది స్పష్టం చేసింది. ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాత రెండు నెలలపాటు చంద్రబాబు మౌనంగా ఉన్నారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలపలేదని, ఒకవేళ అలా చేసి ఉంటే నిరంతరంగా జరిగే నాణ్యత, స్వచ్ఛత నిర్ధారణ తనిఖీల్లో అది తేలుతుందనే విషయం చంద్రబాబుకు తెలుసు కాబట్టే.. రెండు నెలలపాటు మౌనంగా ఉన్నారు. అందుకనే తదుపరి చంద్రబాబు చేసిన ఆరోపణలు బాధ్యతారాహిత్యం, పచ్చి అబద్ధం. కేవలం రాజకీయ లక్ష్యాల కోసం ఈ ఆరోపణలు చేశారు.

జిల్లా వార్తలు


కష్టజీవుల పక్షాన నిలవాలి..



సమావేశంలో మాట్లాడుతున్న వేణు

సింగరేణి(కొత్తగూడెం): కళాకారులు, కవులు కష్టజీవుల పక్షాన నిలవాల్సిన అవసరముందని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పి.వేణు పేర్కొన్నారు. కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలువురు కళాకారులు సినిమాలు, పేరు కోసం ఆరాటపడుతూ శ్రమజీవులపై జరుగుతున్న దోపిడీని విస్మరించడం సరికాదన్నారు. హిందుత్వ ఫాసిస్ట్ శక్తులు ఆదివాసీలు, దళితులు, మైనార్టీలపై అప్రకటిత యుద్ధాన్ని సాగిస్తుండటమే కాక సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు గ్రీన్ హంట్, ఆపరేషన్ కగర్ పేరుతో అడవుల నుంచి ఆదివాసీలను తరిమికొడుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యాన ఆదివాసీలు, పీడిత, తాడిత ప్రజలను కుట్రలకు బలికాకుండా మేల్కొల్పాల్సిన బాధ్యత అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యపై ఉందని ఆయన తెలిపారు. సమావేశంలో న్యూడెమోక్రసీ నాయకులు జె.సీతారామయ్య, మెంతిని కొండల్‌రావు, వీరమల్ల సురేశ్‌కుమార్ బి.నర్సింగ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత క్రికెటర్లకు ప్రోత్సాహం



శివసేనారెడ్డిని సత్కరిస్తున్న జిల్లా క్రికెటర్లు

ఖమ్మంస్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రికెటర్లను ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి వెల్లడించారు. క్రికెట్ అభివృద్ధి, క్రీడాకారులకు ప్రోత్సాహం తదితర అంశాలపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ఉమ్మడి ఖమ్మం నుంచి పలువురు సీనియర్ క్రికెటర్లు హాజరయ్యారని మహిళా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ మతిన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్, పృథ్వీ తదితరులు పాల్గొనగా, బీసీసీఐతో చర్చించి గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధికి కార్యాచరణ రూపొందిస్తామని శివసేనారెడ్డి తెలిపారని వెల్లడించారు.

పెసల కొనుగోళ్లలో కొర్రీలు

- పోర్టల్‌లో రైతులు నమోదైతేనే అమ్మకానికి అర్హత
- కౌలురైతు పండించినా భూయజమాని పేరిటే విక్రయం
- తేమ, నాపగింజల పేరిట ఆంక్షలతో రైతుల పాట్లు
- ఫలితంగా తక్కువ ధరకే దోచుకుంటున్న వ్యాపారులు



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పెసలు

ఖమ్మంవ్యవసాయం: పెసల కొనుగోళ్లలో విధించిన ఆంక్షలు రైతుల పాలిట శాపంగా మారాయి. పంటకు డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి క్వింటా రూ.6 వేల నుంచి రూ.7 వేలకు మించి చెల్లించకపోవడంతో రైతులకు కనీస మద్దతు ధర దక్కడం లేదు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ.8,682 మద్దతు ధర వచ్చేలా జిల్లాలోని ఖమ్మం, వైరా వ్యవసాయ మార్కెట్లలో పెసల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఆంక్షలు గుదిబండగా మారాయి. అవసరమైన ధ్రువపత్రాలు తీసుకురావడమే కాక పంట నాణ్యతగా ఉంటేనే కొనుగోలు చేస్తున్నారు. లేకుంటే నిరాకరిస్తుండడంతో రైతులు వెనక్కి వెళ్లలేక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయించుకోవాల్సి వస్తోంది.

పోర్టల్‌లో పేరు ఉందా?

రైతు పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ పోర్టల్‌లో నమోదై ఉంటేనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో పెసల అమ్మకానికి ప్రధాన అర్హత లభిస్తుంది. ప్రభుత్వం గడిచిన మూడేళ్లుగా ఏఈఓలతో పోర్టల్‌లో వివరాలు నమోదు చేయిస్తోంది. ఈ క్రమాన రైతు పెసలతో మార్కెట్‌కు వస్తే సర్వే నంబర్ ఆధారంగా పరిశీలించగానే ప్రస్తుత వానాకాలంలో ఏ పంట వేశారు? ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలు తెలుస్తాయి. జాబితాలో పెసలు ఉంటేనే విక్రయానికి అర్హులుగా గుర్తిస్తున్నారు. ఇక కౌలు రైతు పంట పండించినా పోర్టల్‌లో మాత్రం భూయజమాని పేరు ఉంటోంది. దీంతో అమ్మకం సమయాన భూయజమాని ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు సమర్పించాలి. ఆపై పంట విలువ యజమాని అకౌంట్‌లో జమ అయితే ఆ తర్వాత కౌలు రైతు తీసుకోవాలి. ఇలాంటి చిక్కులు పడలేక చాలా మంది ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారని తెలుస్తోంది.



పెసలను జల్లెడ పడుతున్న రైతులు

నాణ్యత పేరిట ఇక్కట్లు

పెసలలో 12 శాతంలోపు తేమ ఉండడమే కాక రంగు, నాప గింజలను పరిశీలిస్తున్నారు. ప్రమాణాల ప్రకారం పెసలు లేకపోతే ఆరబెట్టాలని, నాప గింజలు, మట్టి తొలగించాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో రోజుల తరబడి మార్కెట్‌లో నిరీక్షించాల్సి వస్తోంది. తేమ ఆధారంగా ఎంపిక చేశాక ఆరబెట్టడం, జల్లెడ వేయడం.. ఆపై ఆన్‌లైన్ (క్యూఆర్ కోడ్)లో నమోదు, క్రమపద్ధతిలో కాంటా వేయడమే కాక పంటను గోదాంకు తరలించే వరకు రైతు వెంట ఉండాల్సిందే. ఇలా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో పెసల అమ్మకానికి నాలుగు రోజులకు పైగా సమయం పడుతోంది.

స్పష్టత లేక అవస్థ



సొంత భూమి ఏడెకరాలకు తోడు మరో 11 ఎకరాలు కౌలుకు తీసుకొని పెసర సాగు చేశా. సొంత భూమి వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్నా కౌలు భూమి విషయంలో స్పష్టత లేదు. ఖమ్మం మార్కెట్‌కు 32 క్వింటాళ్ల పెసలు తీసుకొస్తే నాణ్యంగానే ఉన్నా ఆరబెట్టమన్నారు. ఆపై జల్లెడ వేయించి కొనుగోలు చేశారు. ఇదంతా పూర్తయ్యేసరికి మూడు రోజుల సమయం పట్టింది.

–పుతుంబాక వెంకటరమణ, వెంకటాయపాలెం, రఘునాథపాలెం మండలం

రూ.15 వేలకు పైగా నష్టపోయా..



మూడెకరాల్లో పెసర పంట సాగు చేస్తే పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వ మద్దతు ధర వస్తుందని ఖమ్మం మార్కెట్‌కు వచ్చా. కానీ వ్యవసాయ శాఖ పోర్టల్‌లో చూస్తే వివరాలు లేవు. ఫలితంగా క్వింటాకు రూ.7,150 చొప్పున ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించుకోవాల్సి వచ్చింది. దీంతో క్వింటాకు రూ.1,532 చొప్పున రూ.15,320 నష్టపోయా.

–మైనంపాటి అమృతారెడ్డి, ఇభరాపురం, మోతె మండలం, సూర్యాపేట జిల్లా

పీడీఎస్‌యూది పోరాటాల చరిత్ర

సంఘం సమ్మేళనంలో వక్తలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసీం, పక్కన పోటు రంగారావు తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై యాభై ఏళ్లుగా పోరాడుతున్న పీడీఎస్‌యూ చరిత్ర అజరామమని ప్రొఫెసర్ ఖాసీం, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో ఆదివారం పీడీఎస్‌యూ పూర్వ, ప్రస్తుత విద్యార్థుల నాయకుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ.. కుల వివక్ష, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా జార్జిరెడ్డి నేతృత్వాన ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా పీడీఎస్‌యూ ఆవిర్భవించిందని తెలిపారు. ప్రగతి కాముకుల పోరుబాట, నక్సల్బరీ సాయుధ రైతాంగ ఉద్యమానికి తిలకం దిద్దిన మహోన్నత చరిత్ర ఈ సంఘానికి ఉందని చెప్పారు. యాభై వసంతాలు గడిచిన నేపథ్యాన విద్యార్థి ఉద్యమాలపై సమీక్షించుకోవాల్సిన అవసరముందని తెలిపారు. అనంతరం పోటు రంగారావు మాట్లాడుతూ.. ప్రగతిశీల ఉద్యమాలు లేకనే మతోన్మాద శక్తులు పెచ్చరిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సమగ్రతకు భంగం కలిగేలా కొన్ని శక్తులు పరిపాలన సాగిస్తున్నందున అన్ని వర్గాలను చైతన్యం చేసే బాధ్యత విప్లవ విద్యార్థి ఉద్యమాలపై ఉందని చెప్పారు. కాగా, పీడీఎస్‌యూ 50వసంతాల స్వర్ణోత్సవ వేడుకను ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నందున జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత సంఘం పతాకాన్ని వడ్డెల్లి కృష్ణమూర్తి ఆవిష్కరించగా రాయల రవికుమార్, ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, పురుషోత్తం, వి.మనోహర్‌రాజు, రమేశ్, తిరుమల్‌రావు, ఎం.పుల్లయ్య, రాంచంద్రయ్య, వై.నాగేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, విజయ్, నాగిరెడ్డి, రామారావు, నరేందర్, గుర్రం అచ్చయ్య పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య' చేయూత అభినందనీయం



నగదు అందజేస్తున్న తుమ్మల యుగంధర్, పక్కన శ్రీచైతన్య చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

ఖమ్మంసహకారనగర్: వరద బాధితులకు శ్రీ చైతన్య విద్యాసంస్థలు అండగా నిలవడం అభినందనీయమని కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. ఖమ్మంలోని శ్రీచైతన్య ఒలింపియాడ్ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వరదలతో నష్టపోయిన శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన 70 మంది అధ్యాపకులు, 300 మంది విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షల మేర ఆర్థిక సాయంతోపాటు పుస్తకాలు వితరణ చేశారు. కార్యక్రమంలో యుగంధర్‌తో పాటు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. శ్రీచైతన్య విద్యాసంస్థలు చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. అనంతరం చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ద్వారా సీఎం సహాయనిధికి రూ.25 లక్షల చెక్కు ఇవ్వనున్నట్లు తెలిపారు. డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, అకడమిక్ డైరెక్టర్ సాయిగీతిక, ఏజీఎం చేతన్ మాథుర్, కార్పొరేటర్ ఆళ్ల నిరీషఅంజిరెడ్డి, నిర్మల్ హృదయ్ విద్యాసంస్థల చైర్మన్ సాంబశివారెడ్డి, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

బోనకల్: హైదరాబాద్‌లో ఈ నెల 14, 15వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఖమ్మం జిల్లా బాలికల జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. ఈ జట్టులో ప్రతిభ కనబరిచిన బోనకల్ క్రీడాకారులు కె.మధులత, కె.ఆకాంక్ష ఈ నెల 25 నుంచి హరియాణా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులను బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.కిశోర్‌కుమార్, దొంతు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు రామచంద్రరాజు, కోచ్ అమిరేశి లింగయ్య అభినందించారు.



మధులత



ఆకాంక్ష

కిన్నెరసానిలో సండే సందడి!

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల పర్యాటకులు కుటుంబాల సహా చేరుకుని డ్యామ్ వద్ద నుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హుషారుగా గడిపి తిరుగుముఖం పట్టారు. కాగా, 400 మంది కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.14వేలు, 150మంది బోటుషికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.7,070 ఆదాయం లభించిందని నిర్వాహకులు తెలిపారు.



బోటుషికారు చేస్తున్న పర్యాటకులు